సాక్షి విజయనగరం

శనివారం । 16 । మార్చి । 2024



గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో ఈ నెల 17న జరగనున్న గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని డీఆర్వో ఎస్.డి.అనిత తెలిపారు. - 8లో



కళాను అవమానిస్తే... తూర్పుకాపుల తడాఖా చూపిస్తాం

టీడీపీ నేత కిమిడి కళా వెంకటరావును అవమానిస్తే తూర్పుకాపుల తడాఖా చూపిస్తామని నాయకులు హెచ్చరించారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని (సా॥)	ఆది (ఉ॥)
6.12	4.41

న్యూస్‌రీల్

ఓటరు చైతన్య ర్యాలీ



జెండాఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కోట కూడలి వరకు శుక్రవారం నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని కలెక్టరేట్ వద్ద ఆమె ప్రారంభించారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేసి, అత్యధిక ఓటింగ్ శాతం నమోదుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటత్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎ.వి.రత్నం, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, యువ ఓటర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి సంకిలి విద్యార్థిని సైన్స్ ప్రాజెక్టు



సంకిలిలో విద్యార్థి హరితను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు

రేగిడి: మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.హరిత జాతీయ స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.రామినాయుడు శుక్రవారం తెలిపారు. చిత్తూరు జిల్లా పడమనేరులో ఈనెల 12న నిర్వహించిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన ప్రదర్శన పోటీలో విద్యార్థిని రూపొందించిన 'అడ్వాన్స్‌డ్ హేమర్‌మల్టీ పర్పజ్ టూల్ ప్రాజెక్టు' ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ప్రాజెక్టును జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు హెచ్ఎం వెల్లడించారు. వెల్డర్స్, ఎలక్ట్రీషియన్స్, పంబ్లర్స్, కార్పెంటర్, మెకానిక్‌ల పనిని సులభతరం చేయడం, వారి పని సమయాన్ని ఆదా చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని గైడ్ టీచర్ కె.ప్రవీణలత తెలిపారు. విద్యార్థినిని, గైడ్ టీచర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

19న వైద్య ఉద్యోగులకు గ్రీవెన్స్ డే

విజయనగరం ఫోర్ట్: వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన వైద్య ఉద్యోగులకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విన్నవించుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా సూర్యనారాయణరాజు




చీపురుపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా గుర్ల మండలానికి చెందిన కె.వి.సూర్యనారాయణరాజును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. సూర్యనారాయణరాజు సేవలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఆయన ప్రస్తుతం రాజాం నియోజవకర్గ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో విజయనగరం జిల్లాలోని ఎస్.కోట, శ్రీకాకుళం జిల్లాలోని పలాస నియోజకవర్గం పరిశీలకులుగా పనిచేశారు. విజయనగరం డీసీఎంఎస్ చైర్మన్‌గానూ పనిచేశారు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీల కంగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న ఆయన సేవలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న గైనికాలజిస్టులకు ఇంటిగ్రేటెట్ హైరిస్క్ ప్రగ్నెంట్ మేనేజ్‌మెంట్, ట్రాకింగ్ ప్రోటోకాల్స్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించడం ద్వారా హైరిస్క్ తీవ్రతను తగ్గించి సుఖప్రసవం చేసే అవకాశం ఉంటుందన్నారు. రక్తహీనతతో బాధపడేవారిని ప్రసవానికి వారం రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ అచ్చుతకుమారి, వైద్యులు జి.శశిభూషణరావు, అరుణకుమారి, రోహిణి, శివప్రసాద్, సత్యవతి, పి.రత్నకుమారి పాల్గొన్నారు.

ఫ్యాన్ హోరు...



- ప్రతిపక్ష పార్టీల నుంచి జోరుగా వైఎస్సార్‌సీపీలో చేరికలు
- పొత్తుల టీడీపీతో భవిష్యత్తు కానరాని కార్యకర్తలు
- విసిగిపోయిన వారంతా వైఎస్సార్‌సీపీ వైపు చూపు
- అన్ని నియోజకవర్గాల్లోనూ మొదలైన చేరికలు



మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు, సరోజిని దంపతులు



వైఎస్సార్‌సీపీలో ఇటీవల చేరిన గంట్యాడ మండలం నరవ గ్రామస్తులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇచ్చిన మాటను త్రికరణశుద్ధితో నెరవేర్చడం .. కులాలు, మతాలు, రాజకీయాలు, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం.. పేద, మధ్యతరగతి వర్గాల్లో 'నవరత్న' వెలుగులు నింపుతూ.. ఐదేళ్లుగా సాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు జనం జేజేలు పలుకుతున్నారు. భవిష్యత్తులేని పార్టీల కాడిని వీడి అందరికీ మేలు చేసే, అండగా నిలిచే పార్టీకి జై కొడుతున్నారు. దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీకి పొత్తులు లేనిదే దిక్కులేకుండా పోయిందని, చంద్రబాబుతో ఇక పార్టీకి భవిష్యత్తు లేదని విసిగిపోయిన నాయకులు సైతం వైఎస్సార్‌సీపీ తలుపుతడుతున్నారు. అలాంటివారికి స్థానిక క్యాడర్ సమ్మతితో వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ కండువా వేసి స్వాగతం పలుకుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రకటన శనివారం రానున్న నేపథ్యంలో ఈ వలసలు మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- చీపురుపల్లి నియోజకవర్గంలోని టీడీపీకి చెందిన చీపురుపల్లి మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మీసాల సరోజిని, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆర్.విజయసారథి నేతృత్వంలో వెయ్యి కుటుంబాలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశాయి. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గరివిడి మండలంలో వెదుల్లవలస గ్రామంలో టీడీపీకి చెందిన మన్నెపురి లక్ష్మణ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు ఆ పార్టీని వీడి జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్నారు.
- విజయనగరం నియోజకవర్గంలో ఈనెల 5న జిల్లా యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యాల కృష్ణ నేతృత్వంలో 125 యాదవ కుటుంబాలు పండగ వాతావరణంలో ప్రతిపక్ష టీడీపీకి గుడ్‌బై చెప్పేశాయి. వారికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 7న విజయనగరంలోని 5, 6 డివిజన్‌లకు చెందిన 36 యాదవ, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈనెల 11న నగరంలోని 8వ డివిజన్ లెంకవీధికి చెందిన 25 కుటుంబాలు కోలగట్ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 13వ తేదీన బొబ్బాదిపేట, పోలయ్యపేట ప్రాంతాలకు చెందిన 25 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పేసి అధికారపార్టీలోకి చేరిపోయాయి.
- గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో ప్రతి రోజు ఏదొక గ్రామం నుంచి టీడీపీకి గుడ్ బై చెప్పేస్తూనే ఉన్నారు. అక్కడ గ్రూపు తగాదాలకు తోడు, టీడీపీ కొత్త అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తండ్రిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్న దృష్ట్యా ఆయన వైఖరి నచ్చనివారు వైఎస్సార్‌సీపీలో చేరిపోతున్నారు. ఇటీవల గంట్యాడ మండలం నరవలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సమక్షంలో భారీ సంఖ్యలో చేరికలు జరిగాయి.
- శృంగవరపుకోట నియోజకవర్గంలో టీడీపీలో గ్రూపు తగాదాలతో విసిగిపోయిన కార్యకర్తలు ఆ పార్టీని వీడిపోతున్నారు. నేడో రేపో అభ్యర్థి ఎవరో తేలిన తర్వాత ఈ వలసలు మరింత ఉధృతంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో భవానీనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ల నర్సింగరావు, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, రామునాయుడు, శివ, సురేష్‌కుమార్, కె.మదన్, కె.రమేష్, కొయిలాడ దుర్గినాయుడు, వాసుదేవర సాయి, బంక సతీష్, తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వేపాడ మండలం ఆకులసీతంపేట గ్రామానికి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్నారు.
- రాజాం నియోజకవర్గంలో రాజాం మున్సిపాలీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని పలు టీడీపీ, జనసేన కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. హరిజన వీధి, మాదిగవీధి సచివాలయం పరిధిలోంచి 150 కుటుంబాలు, బుచ్చింపేట గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో ఇటీవల వైఎస్సార్ సీపీలోకి చేరారు. రాజాం మండలంలో దోసరి, గడిముడిదాం, అంతకాపల్లి, బొద్దాం తదితర గ్రామాల్లో టీడీపీ నుంచి వందకుపైగా కుటుంబాలు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువా వేసుకున్నాయి. సంతకవిటి మండలంలో రామారాయపురం గ్రామం నుంచి రెండు రోజులు క్రితం టీడీపీకి గుడ్‌బై చెప్పేసి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ చేతుల మీదుగా పార్టీ కండువా వేసుకున్నాయి. రేగిడి మండలంలో ఖండ్యాం, బాలకవివలస, మునకలవలస పంచాయతీల్లో 60 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి పాలవలస విక్రాంత్ సమక్షంలో పార్టీలో చేరాయి. వంగర మండలంలో అరసాడ గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి.
- పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురం పట్టణంలో 25వ వార్డుకు చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఈ నెల 15న వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో చేరారు. టీడీపీకి గుడ్‌బై చెప్పి సీతానగం మండలం చినంకలాం సర్పంచ్ పోల తిరుపతిరావు, అప్పల నరసమ్మలు తమ అనుచర వర్గం 50 కుటుంబాలతో వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్నారు. పార్వతీపురం పట్టణంలో టీడీపీ క్రియాశీల నేత పోల సత్యన్నారాయణ (పీఎస్ఎన్) తన అనుచర వర్గంతో ఈనెల 11న వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదబొండపల్లి గ్రామానికి చెందిన 50 మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. సీతానగరం మండలం రంగంపేట, అనంతరాయుడుపేట గ్రామాల్లో 150 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్వతీపురం మండలం నర్సిపురం మండలం విశ్వంబరపురం గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు ఈనెల 4వ తేదీన వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలం చిలగాం పంచాయతీ జోడుమానుగూడ గ్రామస్థులు పెద్ద ఎత్తున టీడీపీ నుంచి ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్న భవానీనగర్ వాసులు



వైఎస్సార్‌సీపీలో చేరిన రాజాం హరిజనవీధి యువత, పెద్దలు

గంజాయిపై పోలీస్ పంజా

అంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో అక్రమంగా సాగుచేసే గంజాయి తరలింపునకు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మార్గాలనే వ్యాపారులు ఎంచుకుంటున్నారు. దీనిని పసిగట్టిన పోలీసులు ప్రభుత్వ ఆదేశాలతో చెక్ పోస్టుల సంఖ్య పెంచారు. నిఘావేశారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నాలుగేళ్లుగా గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ తరలింపుదారుల గుండెల్లో దడపుట్టిస్తున్నారు. గంజాయి వాసన గుప్పుమనకముందే వారిని కటకటాల పాలుచేస్తున్నారు. జిల్లాలో ప్రశాంతవాతావరణం నెలకొల్పడంలో కీలకభూమిక పోషిస్తున్నారు.



వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)



పి.కోనవలస చెక్‌పోస్టు

విజయనగరం క్రైమ్: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు, ఎస్ఈబీ బృందాలు సంయుక్తంగా 'పరేషన్ పరివర్తన' పేరుతో దాడులు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 2,260 లొకేషన్‌లలో పోలీస్, ఎస్ఈబీ 107 ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాయి. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ తనిఖీ లు జరుపుతున్నాయి. గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్టవేస్తున్నాయి. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాయి. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పి పోలీసుల సహకారంతో దాడులు విస్తృతం చేసి గంజాయి రవాణా దారుల్లో దడపుట్టిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సాలూరు, బొబ్బిలి, విజయనగరం తదితర ప్రాంతాల్లో గంజాయిని విడిచిపెట్టి నిందితులు పరారైన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

ప్రధాన మార్గంగా...

అంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొండ ప్రాంతాల్లో అక్రమంగా సాగుచేసిన గంజాయి తరలింపునకు వ్యాపారులు విజయనగరం ఉమ్మడి జిల్లాను ప్రధాన రహదారి మార్గంగా ఎంచుకుంటున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషిచేస్తోంది. ప్రస్తుతం ఆపరేషన్ పరివర్తన పేరుతో గంజాయి పంటలు పండించే వారికి అవగాహన కల్పించి, పంటలను నాశనం చేస్తోంది. నిషేధిత వస్తువు ల అమ్మకాలు చేయవద్దని హెచ్చరికలు జారీచేస్తోంది. ఉమ్మడి జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో స్పెషల్ టాస్కఫోర్స్ టీమ్‌లు విస్తృత దాడులు చేస్తున్నాయి. రహస్యంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుంటున్నాయి. గత నాలుగేళ్లుగా నిషేధిత గంజా రవాణాపై డేగకన్ను పెట్టడంతో ప్రారంభంలో కేసుల సంఖ్య పెరిగింది. గంజాయి తరలించే మార్గాలైన పెదబయలు మంగబంద, గుంటసీమ, దబ్రిగుడ, అరకు మీదుగా అనంతగిరి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస మీదుగా విశాఖ, కొటారుబిల్లి కూడలి, గంట్యాడ మీదుగా, ఒడిశాలోని కోరాపుట్ నుంచి బరంపురం, సాలూరు మీదుగా విజయనగరంలోకి, రాయగడ మీదుగా పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, విజయనగరం మీదుగా విశాఖ వైపు వెళ్లే మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ముమ్మర తనిఖీలు జరుపుతున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి తరలింపు వాహనాలను పట్టుకుంటున్నారు.

నిరంతరం నిఘాతో సత్ఫలితాలు



గంజాయి విక్రయం, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లతో దాడులు చేయిస్తున్నాం. గంజాయిని చిన్నమొత్తంలో విక్రయిస్తున్న వ్యాపారులు, సేవిస్తున్న వారిని నిఘా టీమ్ అదుపులోకి తీసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌కి అప్పగిస్తోంది. గంజా సేవించిన వారిపై 2022లో 10 కేసులు నమోదు చేసి 26 మందిని, 2023లో 25 కేసులు నమోదుచేసి 45 మంది అరెస్టు చేశాం. బొడ్డవర చెక్‌పోస్టును 24 గంటలు పని చేసే విధంగా చర్యలు చేపట్టారు. చెక్‌పోస్టు పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చెక్‌పోస్టు మీదుగా వెళ్లి, వచ్చే వాహనాలను పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

చెక్‌పోస్టులు ఇలా..

మండలం	చెక్కుపోస్టు ప్రాంతం
పాచిపెంట	పి.కోనవలస
కొమరాడ	కూనేరు
పార్వతీపురం	ఆర్.కె.బట్టివలస
ఎస్.కోట	బొడ్డవర
సాలూరు	పద్మాపురం

గంజాయి కేసులు నమోదు ఇలా....

ఏడాది	బుక్ అయిన కేసులు	అరెస్ట్ అయిను వ్యక్తులు	సీజ్ చేసిన గంజాయి
2016	16	42	1522 కేజీల 705 గ్రా..
2017	23	63	4019కేజీల935 గ్రా.
2018	07	21	2024కేజీల 60 గ్రా
2019	35	69	6231 కేజీల 301 గ్రా.
2020	35	79	6209 కేజీల 730 గ్రా.
2021	32	73	9687 కేజీల 378గ్రా.
2022	51	100	3181 కేజీల.055 గ్రా.
2023	58	105	2558కేజీల 055 గ్రా
2024	3 (ఫిబ్రవరి)	6	100 కేజీల.020 గ్రా

కూటమిని తరిమికొట్టండి

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మెరకముడిదాం శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఎన్నికల వేళ గ్యారెంటీల పేరిట అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ కూటమిని తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనువాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు. గరివిడిలోని పార్టీ కార్యాలయంలో మెరకముడిదాం మండలానికి చెందిన బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, పార్టీ శ్రేణులకు ఎన్నికల నిర్వహణపై శుక్రవారం దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో సమన్వయంతో ముందుకు సాగి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, బొత్స సత్యనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికలు జరిగినంత వరకు ప్రతీఓటరును ఒకటికి పదిసార్లు కలవాలని, ఇతర పార్టీల వారిని సైతం ఓట్లు అడగాలని, ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలవారికి, అన్ని పార్టీల వారికి సంక్షేమ పథకాలతో ప్రయోజనం చేకూరిందన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. చంద్రబాబునాయుడు గ్యారెంటీల పేరిట మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న తీరును ప్రతీ ఇంటికి వివరించాలన్నారు. 2014లో రైతులు, డ్వాక్రా మహిళలు, యువతను మోసం చేసిన తీరును తెలియజెప్పాలన్నారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేద్దామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందని, బూత్ కన్వీనర్లు, సభ్యులు ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కేఎస్ఆర్‌కే ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మ జాతరకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి మూడు రోజుల పాటు కనకమహాలక్ష్మి జాతర
- అమ్మవారి దర్శనానికి 3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- 600 మందితో భారీ పోలీస్ బందోబస్తు



అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసి క్యూ కాంప్లెక్స్‌లు.



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగుబంగారం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు వేళయింది. ఆదివారం నుంచి మూడురోజుల (ఈనెల 17,18,19) పాటు జరిగే 26వ జాతర మహోత్సవాలకు ఆలయ పాలకవర్గం, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతర మూడు రోజులూ దాదాపు మూడు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని దేవాదాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనల మేరకు అమ్మవారి జాతరను వేడుకగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దర్శన క్యూకాంపెక్స్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ఎం.దీపిక ఆధ్వర్యంలో 600 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం

ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర వైభవోపేతంగా జరగనుంది. మూడు రోజులు అమ్మవారి జాతర నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. వీఐపీ దర్శనం పాసులు రద్దు చేశాం. దేవదాయశాఖ నిర్దేశించిన టికెట్లను కొనుగోలు చేసుకుని భక్తులు అమ్మవారి దర్శనం చేసుకోవచ్చు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల నుంచే అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుంది.

– ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద), ఆలయకమిటీ ఛైర్మన్

దర్శనం పాసులకు స్వస్తి....

మూడు రోజులు జరిగే అమ్మవారి జాతరలో ఎలాంటి దర్శనం పాసులు జారీ చేయడం లేదని దేవదాయశాఖ, పాలకవర్గం వెల్లడించింది. గతంలో వీఐపీ పేరుతో దర్శనం పాసులు జారీ చేసే విధానం ఉండేది. 2019లో వైఎస్సార్ సిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచన మేరకు వీఐపీ దర్శనం పాసులు రద్దు చేశారు. దేవదాయశాఖ నిర్దేశించిన టికెట్లను కొనుగోలు చేసుకుని భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది.

జాతరలో పూజా కార్యక్రమాలు ఇలా..

17న ఆదివారం ఉదయం 5 గంటలు నుంచి సంప్రదాయం ప్రకారం అమ్మవారికి నేత్రోత్సవం జరుగుతుంది. ఉదయం 7 గంటలకు జంగిళ్లతో పాలధారోత్సవం, మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి ఘటాలు, ప్రభలతో శోభాయాత్ర ఉంటుంది. ఈ నెల 18న సోమవారం అమ్మవారికి సంప్రదాయ పూజలు, అభిషేకాలు చేస్తారు. 19న మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పట్టణంలో ఉన్న అనుబంధ అమ్మవార్లు శ్రీకోటదుర్గమ్మ తల్లి, అసిరితల్లి, భగీరథమ్మ తల్లి, సిర్లి ఎల్లమాంబ, సంతానలక్ష్మి అమ్మవార్లకు పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఘటోత్సవం ఉంటుంది. మూడు రోజులూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎమ్‌ల నియామకం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎమ్‌ల నియామకం జరిగిందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావు అన్నారు. మండలంలోని అంటివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సమస్యలుంటే తెలపాలని విద్యార్థులను కోరారు. కలుషిత ఆహారంతిని అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై పాఠశాలల్లో ఏఎన్‌ఎంలు ఉంటారని, విద్యార్థులకు ఆరోగ్యభరోసా లభిస్తుందన్నారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు ఉన్నారు.

కిక్ బాక్సింగ్‌లో జేఎన్‌టీయూ విద్యార్థికి కాంస్యపతకం



విజేతను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: ఉత్తర ప్రదేశ్ మీరట్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీల్లో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ జట్టు క్రీడాకారుడు కె.దినేష్ (రఘు కాలేజీ విశాఖపట్నం) కాంస్య పతకం సాధించాడు. కిక్ బాక్సింగ్ పురుషుల 58 కిలో విభాగంలో ఈ పతకం లభించింది. విద్యార్థిని వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకర్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.వి.పాపారావు, ఫిజికల్ డైరెక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

ఐటీఐ ఉద్యోగి తొలగింపు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏటీఓగా విధులు నిర్వహిస్తున్న సిద్ధార్థ అనే ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. నకిలీ ఇంజినీరింగ్ ధ్రువపత్రంతో కొన్నేళ్లుగా శ్రీకాకుళం విజయనగరం జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగం చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఆయనపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అభియోగాలు నిజం కావడంతో సిద్ధార్థను ఏటీఓ వీధిలో నుంచి తొలగించారు. ఈ విషయమై ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.వి.రమణ విలేకరులతో మాట్లాడుతూ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన రాంబాబు

బలిజిపేట: భార్యా, భర్తల వివాదం కారణంగా భర్త రాంబాబు(29) మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగాపురం గ్రామానికి చెందిన యామల రాంబాబుకు, బర్లి గ్రామానికి చెందిన రూపకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వీరిమధ్య శుక్రవారం గొడవ జరిగింది. భార్య తరఫున వారు వచ్చి ఇద్దరినీ సముదాయించారు. అనంతరం రూప తల్లిదండ్రులు 8 నెలల చిన్నారితో రూపను వారి ఇంటికి తీసుకెళ్లారు. దీనికి మనస్థాపం చెందిన రాంబాబు తన ఇంట్లో బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు.

1973 మద్యం సీసాలు సీజ్



పట్టుబడిన మద్యం సీసాలు

బలిజిపేట: బలిజిపేటలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న 1973 (180ఎంఎల్)మద్యం సీసాలను ఎస్‌ఐ వి.పాపారావు బృందం శుక్రవారం పట్టుకుంది. బలిజిపేటలో చిన్న షాపు నడుపుతున్న టి.గోవిందమ్మకు చెందినివిగా గుర్తించింది. మద్యం సీజాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా, నియోజకవర్గం స్థాయిలో కంట్రోల్ రూమ్
- ఎన్నికల ప్రకటన వెలువడిన నుంచే విధులు
- నిర్దేశిత ప్రొఫార్మాలలో తక్షణ నివేదికలు
- అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సమష్టిగా ముందుకు సాగాలని కలెక్టర్ నాగలక్ష్మిసెల్వరాజన్ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంట్రోల్ రూమ్‌కు కేటాయించిన అధికారులు చేయాల్సిన విధులపై పీపీటీ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తలను మానిటర్ చేయడానికి మీడియా రిలేటెడ్ సెల్, సోషల్ మీడియా సెల్, కంప్లైంట్స్ మానిటరింగ్, వెబ్ కాస్టింగ్ మానిటరింగ్, రిపోర్ట్ మానిటరింగ్ విభాగాలను కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేశామన్నారు.



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

ఫిర్యాదు పరిష్కార నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారి మాత్రమే విడుదల చేయాలని స్పష్టంచేశారు. నియోజక వర్గం స్థాయిలో ఆర్‌ఓ ఆధ్వర్యంలోను, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జిగా సీపీఓ, రిపోర్ట్స్ ఇన్‌చార్జిగా జిల్లా జెడ్పీ సీఈఓ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి, ఫొటో గ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు ఐడీ కార్డులను ఆర్‌ఓ జారీ చేయాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన ఓటర్ హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ పోర్టల్స్, సాక్ష్యం, సీవిజిల్, 1950 కాల్ సెంటర్‌కు అందే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జేసీ కే.కార్తీక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కంట్రోల్ రూమ్ ఇంచార్జ్‌లు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా అవగాహన

ఓటుహక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ నెల 25న మహిళా ఓటర్లతో ర్యాలీ నిర్వహించి, కళాజాతాలు ప్రదర్శించాలని, రంగోలి పోటీలను నిర్వహించాలని సూచించారు. సీనియర్ సిటిజెన్లకు యోగ, మెడిటేషన్ వంటి కార్యక్రమాలను, యువతతో బైక్ ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి అయిన హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు వీటన్నిటిని పర్యవేక్షించి ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్‌కు పంపించాలని సూచించారు.

కళాను అవమానిస్తే... తూర్పుకాపుల తడాఖా చూపిస్తాం

- రాజాంలో అత్యవసర సమావేశంలో స్పష్టంచేసిన టీడీపీ నాయకులు



కళాకు టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న నేతలు

రాజాం: టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావును పార్టీ అధిష్టానం పెద్దలు చంద్రబాబునాయుడు, లోకేశ్ తీవ్ర అవమానానికి గురిచేస్తున్నారని, మూడు జిల్లాల తూర్పుకాపులకు చెందిన పెద్దవ్యక్తిని ఇలా కించపరిస్తే సహించేది లేదని రాజాం, రేగిడి, వంగర మండలాలకు చెందిన టీడీపీ నాయకులు హెచ్చరించారు. రాజాంలో సూర్యదుర్గ కళ్యాణమండపంలో వందమందికి పైగా టీడీపీ నాయకులు శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాం పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు టంకాల వెంకటేష్‌తో పాటు రాజాం మున్సిపాల్టీ, రాజాం, రేగిడి, వంగర మండలాలకు చెందిన సీనియర్ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. మూడు జిల్లాల్లో కళా వెంకటరావు తూర్పుకాపులకు పెద్దదిక్కుగా ఉన్నారని, టీడీపీలో చాలా సీనియర్ నాయకుడిగా ఉన్నారన్నారు. ఇప్పుడు రెండు పర్యాయాలు టికెట్లు ప్రకటించిన చంద్రబాబు ఎచ్చెర్ల నియోజకవర్గానికి ఇంతవరకూ కళా పేరును ప్రకటించకపోవడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ముందునుంచి పార్టీలో ఉంటున్న కళాను పక్కనపెట్టి, వెనుకనుంచి వచ్చిన ఎవరెవరినో గుర్తించి, ఇలా బీసీలను వెనుకపెట్టి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బీసీలకు చంద్రబాబు అన్యాయం చేస్తే మూడు జిల్లాలో బీసీలు అంతా ఎదురుతిరుగుతారని వెల్లడించారు. టికెట్ ప్రకటించడంలో జాప్యంచేస్తే అటు ఎచ్చెర్ల, పాతపట్నం, ఇటు రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో కిమిడి కుటుంబీకుల అభిమానులమైన తామంతా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఎచ్చెర్లతో పాటు చీపురుపల్లి నియోజకవర్గాల టికెట్లను కిమిడి కళా వెంకటరావుకు, కిమిడి నాగార్జునలకు కేటాయించాలని పట్టుబట్టారు. కార్యక్రమంలో పైల వెంకటరమణ, శాసపు కేశవనాయుడు, ఉదయాన మురళీ, యర్రాపాత్రుని హేమసుందరరావు, టంకాల దిలీప్‌కుమార్, టంకాల శంకరరావు, రామగోపాల్ తదితరులు వందమందికిపైగా టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన



ధమరసింగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని ధమరసింగిలో రూ.1.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ధమరసింగి నుంచి నెల్లిమర్ల మండలం చనమల్లుపేట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మితం కానుంది. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ మీసాల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధే లక్ష్యం

- జీసీసీ డీఎం వి.మహేంద్ర కుమార్



గుమ్మలక్ష్మీపురం ఇండేన్‌గ్యాస్ గొడౌన్‌లో గ్యాస్ వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచనలిస్తున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలను పెంచి జీసీసీ వ్యాపారాభివృద్ధి సిబ్బంది కృషి చేయాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ సూచించారు. గుమ్మలక్ష్మీపురంలో జీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్‌బంకును, ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బంకులో నిర్మాణ దశలో ఉన్న పెట్రోల్, డీజిల్ అదనపు నిల్వల ట్యాంకులతో పాటు, విక్రయాలను పరిశీలించారు. ఇండేన్‌గ్యాస్ గొడౌన్‌కు వెళ్లి నిల్వలు, సరఫరా వివరాలపై ఆరా తీశారు. గ్యాస్ వినియోగదారుల శ్రేయస్సు కోసం 10 కేజీల బరువుతో తీసుకొచ్చిన ఫైర్‌గ్యాస్ దిమ్మలు సద్వినియోగించుకునేలా ప్రోత్సాహించాలని గొడౌన్ ఇన్‌చార్జి సంఘం నాయుడుకు సూచించారు. గిరిజనులు సేకరించి, పండించి తీసుకొస్తున్న అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, సమయపాలన పాటిస్తూ, నిత్యావసర వస్తువుల విక్రయాలను పెంచాలంటూ మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతికి డీఎం సూచించారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

- జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్



వినియోగదారుల అవగాహనకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్

పార్వతీపురంటౌన్: వినియోగదారుల చట్టంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పౌరసరఫరాల శాఖ, జిల్లా వినియోగదారుల హక్కులు రక్షణ సంఘం సంయుక్తగా శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇచ్చిన హక్కులను ప్రజలు ఉపయోగించుకోవాలని, హక్కులు తెలుసుకొని నడుచుకోవాలన్నారు. ఎక్కడైనా మోసపోతే సంబంధిత వినియోగదారుల సంఘాలకు, ప్రభుత్వాధికారులకు తెలియజేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు పి.సూర్యారావు, జనరల్ సెక్రటరీ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మోసపోయినప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు సంఘ సమావేశం జరుగుతుందని, ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రత అధికారులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సేంద్రియ పంటల రైతులు, ఉద్యోగులు, సంఘ సభ్యులు ఎం.ఈశ్వరరావు, ఎం.మధు, వి.శ్రీనివాస్, బి.రంగారావు, ఎం. లక్ష్మణరావు, బోటు రామకృష్ణ, పుండరీకాక్ష, మహిళ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆర్.సాయిరాణి పాల్గొన్నారు.

44 మందికి రూ.38,86,500 సాయం



పరిహారం చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గంలోని 44 మందికి సీఎం సహాయనిధి నుంచి రూ.38,86,500 సాయం మంజూరైంది. సంబంధిత చెక్కులను కొత్తవలస మండలం అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం అందజేశారు. ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు నెక్కల శ్రీదేవి, ముమ్మలూరి వెంకటలక్ష్మి, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, ఎస్.కోట వైఎస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పార్టీ మండలాధ్యక్షులు ముమ్మలూరి జగన్నాథం, ఒబ్బిన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- 6,568 మంది అభ్యర్థులకు 14 పరీక్ష కేంద్రాల కేటాయింపు
- ప్రారంభమైన కాల్ సెంటర్ నంబర్: 08922-236947
- డీఆర్వో ఎస్.డి.అనిత



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎస్.డి.అనిత

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 17న జరగనున్న గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత ఆదేశించారు. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణపై ఏపీపీఎస్‌సీ ప్రతినిధులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమీక్షించారు. పరీక్ష నిర్వహించేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు, ఆయా అధికారుల విధులు, బాధ్యతలను వివరించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరుకానున్న 6,568 మంది అభ్యర్థులకు 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టంచేశారు. అభ్యర్థుల కోసం కాల్ సెంటర్ (ఫోన్ నెం: 08922-2363947, 738224225, 9848381463) పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఏపీపీఎస్‌సీ అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబూరావు, ఏఎస్‌ఓ పి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ తల్లి తొలేళ్ల సంబరం

- 17న సిరిమానోత్సవం



ఎల్లమాంబ వనంగుడి వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



పూజలందుకుంటున్న ఎల్లమ్మ

విజయనగరం టౌన్: సిరులతల్లి పండగకు సర్వం సిద్ధమైంది. విజయనగరం పట్టణంలోని ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో తొలిఘట్టమైన తొలేళ్ల సంబరం శనివారం వేకువజామున ప్రారంభం కానుంది. జొన్నగుడ్డి వద్ద ఉన్న వనంగుడిలో ఆలయ పూజారులు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఎల్లమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయమంతా విద్యుత్ అలంకరణలతో ప్రత్యేక సెట్‌లను వేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలు ఏర్పాటుచేశారు. ఉత్సవాల కరపత్రాలను జొన్నగుడ్డి ఎల్లమాంబ సేవా సంఘం వనంగుడి కమిటీ అధ్యక్షుడు చందక నూకరాజు ఆవిష్కరించారు. తొలేళ్ల పండగ రోజు వనంగుడి నుంచి ముత్రాటలతో ఊరేగింపు ఉంటుందని, సిరిమానోత్సవం రోజున పూజారి చందక అప్పారావు సిరిమానును అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో పూజారి అగ్రపు సన్యాసిరాజు, కళ్యాణ్, త్రినాథ్, తేజ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో..

- విద్యార్థులకు జేసీ అవగాహన



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు చాలా విలువైనదని, పోలింగ్ క్రతువులో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. స్వీప్‌లో భాగంగా పలు కళాశాలల్లోని క్యాంపస్ అంబాసిడర్లతో జేసీ శుక్రవారం సమావేశమయ్యారు. ఓటింగ్‌పై చైతన్యవంతం చేసేందుకు ర్యాలీలు, 2కే పరుగు పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ చెప్పారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

- జిల్లాప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్-138 ఎన్‌ఐ యాక్టుకు సంబంధించిన కేసులు, ఎక్సైజ్, మోటార్ ప్రమాద బీమా, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత, విద్యుత్, నీటి పన్నుకు సంబంధించిన, భూ సేకరణకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూల్‌బాగ్ కాలనీ హనుమన్ నగర్‌లోని ఎంఆర్‌వీఆర్‌జీఆర్‌పీజీ బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలోని నూతన కోర్టు భవనంలో ఉదయం 10 గంటలకు జాతీయలోక్ అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి హాజరుకానున్నారు.